9 కేసుల్లో మోస్ట్ వాంటెడ్

● మూడు ఏళ్లుగా పరారీలో ఉన్న ప్రదీప్

● రాజస్థాన్‌లో పట్టుకున్న సైబరాబాద్ సీసీఎస్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అతనో ఘరానా నేరస్థుడు.. 9 కేసుల్లో మోస్ట్ వాంటెడ్.. నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయి.. మూడేళ్లుగా ఆచూకీ తెలియకుండా పరారీలో ఉన్నాడు.. పెండింగ్ కేసులపై దృష్టి పెట్టిన సైబరాబాద్ సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి ఘరానా మోసగాడి ఆటకట్టించారు. రాజస్థాన్‌లో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. సీసీఎస్ డీసీపీ నరసింహ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం దౌల్‌పూర్ జిల్లా బచౌలా గ్రామానికి చెందిన ప్రదీప్.. 2020 నుంచి 2022 వరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలు దొంగతనాలు, దోపిడీలకు పాల్పడ్డాడు. పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్నాడు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 9 కేసుల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్నాడు. నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉండడంతో డీసీపీ నరసింహ ఆధ్వర్యంలో సీసీఎస్ ప్రత్యేక టీమ్ రంగంలోకి దిగింది. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా నిందితుడు రాజస్థాన్‌లో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు నేరస్థుడి ఆటకట్టించి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఘరానా నేరస్థుడిని పట్టుకోవడానికి కష్టపడిన ఏసీపీ శశాంక్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్, కొల్లూరు ఎస్‌హెచ్‌వో రవీందర్, హెడ్ కానిస్టేబుల్ వీరాస్వామి, రవీందర్‌రెడ్డి, కుమార్‌ను సీపీ అభినందించారు.

షాప్‌కు వెళ్లి వచ్చేసరికి వాహనం చోరీ

బంజారాహిల్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): షాప్‌కు వెళ్లి వచ్చేసరికి వాహనం చోరీకి గురైంది. ఇందిరానగర్‌కు చెందిన వై. ధర్మారావు ఈ నెల 7న తన ద్విచక్ర వాహనంపై స్థానిక వాసవి మెడికల్స్‌కు వెళ్లాడు. షాపుకు వెళ్లి కొనుగోలు చేసి బయటకు వచ్చే సరికి వాహనం కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను మోసం చేసిన సినీ కో డైరెక్టర్

బంజారాహిల్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వివాహిత మహిళను విడాకులు ఇచ్చేలా ప్రోత్సహించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడంతో పాటు ఆమె డబ్బుతో మరొకరిని వివాహం చేసుకున్న సినీ కో డైరెక్టర్‌పై కేసు నమోదయింది. నగరానికి చెందిన ఓ మహిళకు 2016లో వివాహం అయింది. ఓ కుమారుడు జన్మించాక భర్తతో గొడవపడి 2021 నుంచి అతనికి దూరంగా ఉంటోంది. ఇదిలా ఉండగా సినీ పరిశ్రమలో కో డైరెక్టర్‌గా పనిచేసే షేక్ గౌస్ మొయినుద్దీన్ అలియాస్ చిన్నాతో పరిచయం ఏర్పడింది. అతడు ప్రేమిస్తున్నానని చెబుతూ యూసుఫ్‌గూడలో ఓ గదిలో ఆమెకు తాళికట్టి కాపురం మొదలు పెట్టాడు. తన తల్లి వస్తుందని మహిళను లేడీస్ హాస్టల్.. అటు నుంచి వేరుగా ఓ గది తీసుకొని ఉంచాడు. కాగా మొయినుద్దీన్‌కు మరో యువతితో వివాహం అయిన్నట్టు ఆమెకు తెలిసింది. మోసపోయినట్టు గ్రహించిన బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినులపై కుక్కల దాడి

● ఇద్దరికి గాయాలు ● కోఠి మహిళా వర్సిటీలో ఘటన




కుక్కకాటుకు గాయపడిన విద్యార్థినులు

మంగళ్‌హట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో కుక్కలు స్వైరవిహారం చేశాయి. ఇద్దరు విద్యార్థిలను కరిచాయి. తీవ్ర గాయాలతో ఆస్పత్రులపాలయ్యారు. వేలమంది విద్యార్థులు చదివే విశ్వవిద్యాలయం, అందులోనూ మహిళా హాస్టళ్లు ఉన్న ప్రాంతంలో కుక్కలు విద్యార్థులను కరవడంతో మిగిలిన వారు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ జిల్లాకు చెందిన అంకిత(19) కోఠి మహిళా విశ్వవిద్యాలయంలోని హోంసైన్స్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో హాస్టల్ నుంచి తరగతి గదికి వెళ్తుండగా కుక్కలు వెంటపడడంతో ఆందోళనకు గురై కిందపడిపోయింది. కంటి వద్ద తీవ్ర గాయం కావడంతో పాటు కుక్కకాటు కారణంగా చెవికి తీవ్ర గాయమైనట్లు తెలిసింది. వెంటనే స్పందించిన సిబ్బంది ఆమెను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇదిలా ఉండగా, డిగ్రీ చదువుతున్న మరో విద్యార్థినిని సైతం కుక్కలు కరవడంతో గాయాలైనట్లు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. ఆమె వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. వారంలో నాలుగుసార్లు కుక్కలను తరలించాలని ఫిర్యాదు చేస్తున్నామని, అవి ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియడం లేదని వారు పేర్కొన్నారు.

జీటీఎస్ ఆలయంలో హుండీ లెక్కింపు

పంజాగుట్ట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీటీఎస్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ భవానీ శంకర అయ్యప్ప సహిత సాయిబాబా ఆలయంలో సోమవారం హుండీ లెక్కించారు. రెండున్నర నెలలకు గాను మొత్తం రూ.2.82 లక్షల ఆదాయం వచ్చింది. హుండీ లెక్కింపులో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ డి.మధుబాబు, ఆలయ ఈఓ సుధాకర్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

గర్భిణులు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య పరీక్ష నిర్వహిస్తున్న సిబ్బంది

ఎర్రగడ్డ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకొని తమ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని నీలిమ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నీలిమ శ్రీనివాస్ అన్నారు. పీఆర్‌నగర్‌లోని నీలిమ హాస్పిటల్‌లో సోమవారం గర్భిణులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీన నీలిమ 9 పేరుతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గర్భిణులకు చేయూతని అందిస్తున్నట్లు తెలిపారు. భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. వైద్య శిబిరంలో సుమారు 250 మంది గర్భిణులు వైద్యసేవలను పొందారు. కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది, వెంకటేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



జీవోదయ అనాథాశ్రమంలో అక్షర జన్మదిన వేడుకల్లో పాల్గొన్న సంఘసేవకులు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి తదితరులు

అనాథ పిల్లలకు తల్లిదండ్రులు లేనిలోటు తీర్చాలి

ఎర్రగడ్డ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలకు తల్లిదండ్రులు లేని లోటును తీర్చడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సంఘ సేవకులు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం ఎర్రగడ్డలోని జీవోదయ చిల్డ్రన్స్ హోమ్‌లోని అనాథ అయిన బాలిక అక్షర జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పిల్లల జన్మదినోత్సవాలు అయితే అనాథాశ్రమానికి వెళ్లి చాక్లెట్లు, బిస్కెట్లు పంచి సంతోషపడతామని అన్నారు. కానీ మనమే వెళ్లి అనాథాశ్రమంలో ఉంటున్న వారి బర్త్‌డే వేడుకలను నిర్వహిస్తే ఆ పిల్లలు ఎంతో సంతోషిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవోదయ చిల్డ్రన్స్ హోమ్ నిర్వాహకురాలు నిర్మల, లయన్ రాజశేఖర్, అశ్విన్ కుమార్ పాల్గొన్నారు.

ఆగిన పనులు.. పూర్తయ్యేదెన్నడు?

● అసంపూర్తిగా ఆగిపోయిన కమ్యూనిటీహాల్

● కార్ల పార్కింగ్‌కు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం

● పట్టించుకోని అధికారులు

యూసుఫ్‌గూడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్న చిన్న బస్తీలు కూలీ నాలీ చేసుకుని పొట్టపోసుకునే జీవితాలు. చిన్న ఇండ్లు, ఇరుకు రోడ్లు. అంతా పేదలు, దిగువ మధ్యతరగతి ప్రజలు. ఇంట్లో ఏదైనా శుభకార్యం జరుపుకోవాలంటే ఫంక్షన్‌హాల్‌లు అద్దెకు తీసుకునే ఆర్థిక పరిస్థితి లేదు. అయితే స్థానిక ప్రజలకు ఇలాంటి ఇబ్బంది లేకుండా సంతోషంగా వేడుకలు జరుపుకునేందుకు ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలతో అన్నిటికీ అనుకూలంగా ఉండే ఏసీ కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపట్టింది. కానీ మధ్యలోనే అది అసంపూర్తిగా ఆగిపోవటంతో అక్కడ కార్లు పార్కింగ్ చేస్తూ, రాత్రివేళ పోకిరీలకు అడ్డాగా మారిపోయింది. పనులు ఆగిపోయి ఏడాది దాటినా ఇంత వరకు ఈ కమ్యూనిటీ హాల్ పనులు అతీగతీ లేకుండా పోయాయి.

ఏసీ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శ్రీకారం

రహ్మత్‌నగర్ డివిజన్ హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్-2 స్థానిక ప్రజల అవసరాల కోసం కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం ప్రభుత్వం ఎస్పీఆర్ హిల్స్ కోరీ స్థలంలో సుమారు ఎకరం కేటాయించారు. ఈ స్థలంలో రూ.3.30 కోట్లతో ఏసీ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను గత ప్రభుత్వంలో ప్రారంభించారు. అయితే హాల్ నిర్మించి పైన షెడ్ కూడా వేశారు. ఆ తరువాత మిగతా పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో మళ్లీ ఎన్నికలు రావడం ప్రభుత్వం మారి కూడా ఏడాది గడిచిపోయింది. కానీ పనులు మాత్రం ఇంకా పూర్తికాలేదు. ఇంకా ఫాల్ సీలింగ్, కల్యాణవేదిక, వంటశాల, మరుగుదొడ్లు, పార్కింగ్ వసతి, విద్యుద్దీకరణ, భారీ సంపు, ప్రహరీ పనులు, ఆఫీసు కార్యాలయం తదితర పనులు పూర్తిచేయాల్సి ఉంది. పూర్తి చేసేందుకు మరో రూ.1.5 కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా.



అసంపూర్తిగా ఆగిపోయిన హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్-2 కమ్యూనిటీహాల్ ముందు పార్కు చేసిన కార్లు

కానీ ఈ నిధులు ఎప్పుడు వస్తాయి.. పనులు ఎప్పుడు జరుగుతాయో తెలియని పరిస్థితి.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

కమ్యూనిటీ హాల్ పూర్తికాక పాడుబడిపోతోంది. దీనికి ప్రహరీగోడ కూడా ఏర్పాటు చేయకపోవటంతో కొందరు కార్లు, వ్యాన్‌లను కమ్యూనిటీహాల్ భవనం చుట్టూ పార్కు చేసి వెళుతున్నారు. ఆ వాహనాలను మళ్లీ ఎప్పుడు తీస్తారో కూడా తెలియకుండా దుమ్ము పట్టి పోతున్నాయి. ఇక రాత్రీ పగలు తేడా లేకుండా ఈ ప్రాంగణంలో పోకిరీలు చేరి, తాగేందుకు అడ్డాగా మార్చుకుంటున్నారు.

నిధులు మంజూరు చేయిస్తాం



హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్-2 కల్యాణ మండపం పనులను పూర్తిచేసేందుకు కావాల్సిన నిధులను మంజూరు చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నిధులు మంజూరు చేయించి పనులు మొదలయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నాం. సాధ్యమైనంత త్వరగా కమ్యూనిటీహాల్ పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం.

\- సీఎన్ రెడ్డి, కార్పొరేటర్

చేనేతకారులకు పొదుపు, బీమా కల్పిస్తున్నాం

● హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

బంజారాహిల్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా చేనేతకారులకు పొదుపు, బీమాతో పాటు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో వారి ఉత్పత్తులకు మార్కెటింగ్‌ను చేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామని రాష్ట్ర హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ అన్నారు.

సోమవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటుచేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. చేనేతకళాకారుల ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. సిల్క్ గ్యాలరీలో నాణ్యమైన పట్టు, కాటన్ వస్త్రాలు లభిస్తాయని, దేశంలోని అన్నిప్రాంతాల చేనేతకారులను ఒక చోట చేర్చి వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించడం శుభ పరిణామమన్నారు. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ సహకారంతో చేనేత ఉత్పత్తులు అందరికీ అందుబాటులో ఉంటాయని, దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేతకారుల ఉత్పత్తులకు సుమారు 80 స్టాల్స్ ఏర్పాటుచేశామని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్ కుమర్ తెలిపారు. రానున్న క్రిస్మస్, సంక్రాంతి, పలు శుభకార్యాలకు అనువుగా పోచంపల్లి, మదనపల్లి, గద్వాల, వెంకటగిరి, చెందేరి, ఇక్కత్, నారాయణ్ పేట్, బెనారస్, కొలకతాతో పాటు పలు నగరాలకు చెందిన విభిన్నమైన, అరుదైన చీరల స్టాల్స్ ఏర్పాటుచేశామని, ఈనెల 15వరకూ ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్, డైరెక్టర్ అరుణ్ కుమార్, హ్యాపీ శ్రీదేవి, ఎడ్యూ ఎంటర్ ప్రినర్ వై. శైలజా పాల్గొన్నారు.



చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న శైలజా రామయ్యర్

ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలి : వెలమ సంఘం

ఖైరతాబాద్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): వెలమ కులస్తులను ఉద్దేశించి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై పోలీసులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆలిండియా వెలమ సంఘం డిమాండ్ చేసింది. ఓ ప్రకటనలో ఆలిండియా వెలమ అధ్యక్షుడు కృష్ణమనేని పాపారావు తెలుపుతూ కులాలపై విద్వేషం చిమ్మే ఇలాంటి నాయకులను శిక్షించాలని, ఆయనను ఎమ్మెల్యే పదవి నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకునేంతవరకు తమ సంఘం ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు.



బేగంపేట్ బస్తీలో జరిగిన ప్రజాపాలన ఉత్సవాల్లో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు విశాల్ సుదం (బంజారాహిల్స్, (ఆంధ్రజ్యోతి)

అవినీతిపై ప్రశ్నించండి: అజయ్‌మిశ్రా



వాక్ ను ప్రారంభిస్తున్న మాజీ చీఫ్ అడిషనల్ సెక్రటరీ అజయ్ మిశ్రా, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

బంజారాహిల్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అవినీతిపై ప్రశ్నించినప్పుడే విలువలతో కూడిన సమాజం ఏర్పడుతుందని మాజీ అదనపు చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా అన్నారు. ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో కేబీఆర్ పార్కు వద్ద సోమవారం వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ వాక్‌ను అజయ్‌మిశ్రా, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్ మిశ్రా మాట్లాడుతూ, దేశంలో అవినీతిని రూపుమాపడానికి ప్రపంచవ్యాప్తంగా అవినీతి వ్యతిరేక దినం 2003లో ప్రారంభమైంది.

ప్రపంచవ్యాప్తంగా అవినీతిని నిర్మూలించడానికి యువతలో చైతన్యం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారు. బక్కని నర్సింహులు మాట్లాడుతూ మంచి ఆలోచనలతో మొదలయ్యే ఏ ఉద్యమమైనా ప్రజలకు మేలు చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, కొన్నె దేవేందర్, కొమటి రమేశ్ బాబు, జి. హరిప్రకాశ్, జోగినిపల్లి సతీష్, బత్తిని రాజేశ్, కొక్కుల ప్రశాంత్, పాశిగంటి వంశీకృష్ణ పాల్గొన్నారు.

తప్పిపోయిన మహిళ



హమీదా బేగం

బోరబండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ తప్పిపోయిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బోరబండ హబీబా ఫాతీమానగర్‌కు చెందిన హమీదా బేగం (54) శుక్రవారం ఇంటినుంచి బయటకి వెళ్లిన ఆమె ఇంటికి రాలేదు. దీంతో కుమారుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సోనియా జన్మదిన వేడుకలు

నేతల సేవా కార్యక్రమాలు



ఖైరతాబాద్‌లో సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీనేత శ్రవణ్ కుమార్, మధుకర్ యాదవ్



సాయిసేవా సదన్ మానసిక వికలాంగుల కేంద్రంలో మానసిక వికలాంగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న రవి శేఖర్ రెడ్డి

హేమవతినగర్‌లో...

ఎర్రగడ్డ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సోనియాగాంధీ కృషి ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కల నెరవేరిందని కాంగ్రెస్ పార్టీ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షులు దూడల రవి గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎర్రగడ్డ హేమవతినగర్‌లో కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ, సోనియాగాంధీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయిందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్ర కృష్ణకుమార్, మొహమ్మద్ సర్దార్, గంటా మల్లేష్, గౌస్ పాషా, శశి కుమార్, యాకమ్మ, సలాం, రాజమణి, మధు గౌడ్, హనుమంతు పాల్గొన్నారు.

పంజాగుట్టలో...

పంజాగుట్ట, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఏజీ కాలనీలోని శ్రీ సాయి సేవా సదన్ మానసిక వికలాంగుల కేంద్రంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం వారికి మిఠాయిలు పంచిపెట్టి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీ సాయి సేవా సదన్ ప్రిన్సిపాల్ స్వప్న, పద్మ,స్వరూప,కళ్యాణి,నాగరాజు,నాళం రాజు గుప్తా,వినోద్ కుమార్ పాల్గొన్నారు.

అమీర్‌పేటలో...

అమీర్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ కోట నీలిమ ఆదేశాల మేరకు సోమవారం బీ బ్లాక్ వైస్ ప్రెసిడెంట్ ఎలీషా విజయ్ రాపోలు ఆధ్వర్యంలో అమీర్‌పేట ఏరియా ఆసుపత్రిలో పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు.

ఖైరతాబాద్‌లో...

ఖైరతాబాద్,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఖైరతాబాద్‌లో ఘనంగా జరిగాయి. టీపీసీసీ కార్యదర్శి మధుకర్ యాదవ్ ఆధ్వర్యం లో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేసి పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

బోరబండలో...

బోరబండ, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలను బోరబండ బస్టాప్ వద్ద కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బర్త్ డే కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు జీవన్‌రాజ్ రాథోడ్



అమీర్‌పేట, లీలానగర్‌లోని దివ్యాంగుల ఆశ్రమంలో చిన్నారులకు స్వీట్ తినిపిస్తున్న కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస రావు, కటికం భాస్కర్ తదితరులు



ఎర్రగడ్డ హేమవతి నగర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు దూడల రవి గౌడ్ తదితరులు



గ్రీవెన్స్‌సెల్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు ముకుందరెడ్డి, కదిరివన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాలకు చెందిన 490 మంది సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీవెన్స్‌సెల్‌కు వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి వాటిని సిబ్బంది ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా అధికారులు ఆశన్న, కోటాజీ, ఇలియాజ్ అహ్మద్, శ్రీరాం, ఆర్.రోహిణి, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

11న ముత్యాలమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన

● మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం



మంత్రి కొండా సురేఖకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ తదితరులు

సికింద్రాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయంలో ఈనెల 11వ తేదీ ఉదయం 8:33 నిమిషాలకు తలపెట్టిన ముత్యాలమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ మంత్రి కొండా సురేఖను దేవాదాయశాఖ ఆహ్వానించింది. సోమవారం అసెంబ్లీలో మంత్రి చాంబర్‌లో దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్, అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి తదితరులు మంత్రి కొండా సురేఖను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. నిర్ణీత సమయంలోనే ముత్యాలమ్మ దేవాలయ నవీకరణతో పాటు గర్భాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠకు చర్యలు చేపట్టినందుకు మంత్రి అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని పండుగలా జరపాలని ఆదేశించారు.



కంటోన్మెంట్ ప్లేగ్రౌండ్ వద్ద సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న జంపన్న ప్రతాప్, బద్దం బల్వంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

బోయినపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎంపీ సోనియాగాంధీ జన్మదిన వేడుకలను న్యూబోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఒకటో వార్డు మహిళాధ్యక్షురాలు నిమ్మ వందన ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బద్దం బల్వంత్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజు, జ్ఞానప్రకాష్, హరికృష్ణ, మారుతిగౌడ్, కుమార్, రామారావు, వరప్రసాద్, జైప్రకాష్, పద్మ, సోని, సరిత, యాదవరావు పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోయగూడలో..

పద్మారావునగర్: కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయగూడ అల్‌ఫతా హోటల్ వద్ద కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఐతా చిరంజీవి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వేద్‌ప్రకాశ్, రమేశ్, లక్ష్మణ్‌రావు, శంకర్ శ్రీనివాస్, శ్యామ్, జగదీశ్, అబ్దుల్‌కలీమ్, షహీన్‌బేగం, నస్రీన్, నసీమా పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలతో ఆనందంగా మహిళలు

అడ్డగుట్ట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో మహిళలు ఆనందంగా ఉన్నారని టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ఆయన అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు షకీల్‌ఖాన్, దాడిగా సందీప్‌కుమార్, అనంతకృష్ణ, భూపతిహరి, సాయిచందర్, మేకల నవీన్‌కుమార్, సుదర్శన్, జాఫర్, ప్రభాకర్, రమేష్, కొమురమ్మ, లక్ష్మి, సులోచన, చంద్రకళ, నరసమ్మ, బ్రహ్మాజీ, అనిల్, సాయికుమార్, వాహీద్, లలిత, వరలక్ష్మి పాల్గొన్నారు.



ఎంపీ సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం వారాసిగూడ చౌరస్తాలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని సోనియాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్‌కుమార్, షకీల్‌ఖాన్, బబ్లూ, చక్రధార్ తదితరులు పాల్గొన్నారు.
- (బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి)



సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా వెస్ట్ మారేడుపల్లిలో ఆమె చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయూబ్ ఖాన్, గజ్వేల్ భరత్ నాగిరెడ్డి తదితరులు
- (మారేడుపల్లి - ఆంధ్రజ్యోతి)

తహసీల్దార్‌కు అండగా మేమున్నాం

- ప్రొటోకాల్ ప్రకారమే చెక్కులు పంచండి: ఆదం



తహసీల్దార్ భీమయ్యగౌడ్‌ను కలిసి ధైర్యం చెబుతున్న ఆదం సంతోష్ కుమార్

అడ్డగుట్ట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ భీమయ్యగౌడ్‌కు అండగా మేమున్నాం. ప్రొటోకాల్ ప్రకారమే చెక్కులను పంచండి' అని పీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఎంపీ సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకల్లో భీమయ్యగౌడ్‌కు ఆయన ధైర్యం చెప్పారు. మారేడుపల్లి రెవెన్యూ పరిధిలోని కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఎందుకు సమాచారం ఇస్తున్నావంటూ కొద్ది రోజుల క్రితం సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు మారేడుపల్లి తహసీల్దార్‌ను బెదిరించారని సమాచారం. ఈ క్రమంలో సోమవారం మారేడుపల్లి రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన ఆదం సంతోష్‌కుమార్‌తోపాటు కాంగ్రెస్ శ్రేణులు తహసీల్దార్‌కు ధైర్యం చెప్పారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వెంటనే ప్రొటోకాల్ ప్రకారమే కాంగ్రెస్ పార్టీ నాయకులైన తమకు కూడా సమాచారం ఇవ్వాలని ఆయనను కోరారు. ప్రభుత్వ అధికారులను బెదిరిస్తే ఊరుకోమని ఆయన హెచ్చరించారు.

బ్యాంక్ కాలనీలో కూలిన ప్రహరీని నిర్మించరూ..



ప్రమాదకరంగా, చెత్తాచెదారానికి అడ్డాగా మారిన బ్యాంక్ కాలనీలోని వర్షపు నీటి కాలువ

మారేడుపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 8 సంవత్సరాల క్రితం కురిసిన భారీవర్షాలకు కంటోన్మెంట్ బోర్డు నాలుగో వార్డు పరిధిలోని మారేడుపల్లి బ్యాంక్ కాలనీలోకాలనీ మధ్యలో ఉన్న వంతెన ప్రహరీ కూలింది. దీంతో ఓపెన్ వర్షపు నీరు భారీ కాలువలో జంతువులు, గేదెలు పడి ప్రమాదానికి గురయ్యాయి. అదేవిధంగా కాలనీలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు వారివారి నివాసాలకు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. నడిచేదారిలోనే ప్రహరీ కూలి ప్రమాదకరంగా మారి ఉంది. ఆ పక్కనే క్రీడాకారుల శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. పిల్లలు ఆడుకునే సమయంలో అందుకునే సమయంలో అందులో పడే అవకాశం ఉంది.

దీంతోపాటు కాలనీ పరిసర ప్రాంతవాసులు ఓపెన్ నాలా కూలిపోయిన స్థలంలో చెత్తాచెదారం వేస్తూ అడ్డాగా మార్చేశారు. దీని కారణంగా ఈ ప్రాంతమంతా దుర్వాసనతో అపరిశుభ్రంగా మారింది. వరద నీటి ప్రవాహానికి కూలిన ఓపెన్ నాలా వంతెన గోడను నిర్మించే విషయంలో కంటోన్మెంట్ బోర్డు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పొంతన లేని సమాధానం చెబుతూ మాటలు దాటవేస్తున్నారని ఆరోపించారు. వంతెన వర్షం నీటి ప్రవాహానికి కూలిపోయిన ప్రహరీని వెంటనే నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వెంటనే నిర్మించాలి



కొన్ని సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాల వరద నీటి ప్రవాహానికి కాలనీ మధ్య నుంచి వెళ్లే ఓపెన్ కాలువ వంతెన కూలిపోయింది. దీంతో ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. ఇదే ఆసరాగా చేసుకున్న కొందరు స్థానికులు అక్కడ చెత్తను వేస్తూ డంపింగ్ యార్డ్‌గా మార్చేశారు. ఈ సమస్యలను అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా వంతెన గోడను నిర్మించాలి. తాము పన్నులు చెల్లిస్తున్నప్పటికీ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారు.
- వీరేశం, సిండికేట్ బ్యాంక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్

జూనియర్ జడ్జికి స్నేహితుల సన్మానం



9ఎస్‌ఇసిపి 25: జూనియర్ జడ్జికి సన్మానం చేస్తున్న సీతారాంపురం స్నేహితులు గ్రామస్థులు

అడ్డగుట్ట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన పెండెం మనోహర్ కుమారుడు పెండెం ముఖేష్ కుమార్ ఇటీవల ఏపీలో జూనియర్ జడ్జిగా నియమితులైన విషయం తెలిసిందే. సొంత గ్రామం జనగామ దేవర్పుల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన ఆయన స్నేహితులు సీతారాంపురం హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ అంబటి యాకయ్య, ట్రస్ట్ సభ్యులు పగిడిపల్లి సతీష్, దొడ్డి రమేష్, భాషిపాక సుధాకర్, అనంతుల శివకుమార్, పుప్పాల సోమేశ్వర్, పెండెం ఉపేందర్ సోమవారం జూనియర్ జడ్జిని అడ్డగుట్టలోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి జూనియర్ జడ్జిగా నియమితులు కావడం ఊరుకే పేరొచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు.

జలమండలి జీఎం, డీజీఎం పర్యటన

అడ్డగుట్ట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్ వెంకట్‌నగర్‌లో మంచినీటి నల్లాల్లో మురుగునీరు సరఫరాపై "ఆంధ్రజ్యోతి"లో వచ్చిన కథనానికి మారేడుపల్లి జలమండలి జీఎం వినోద్, డీజీఎం విద్యాసాగర్, సూపర్‌వైజర్ శ్రీకాంత్ స్పందించారు. వారు సోమవారం ఉదయం వెంకట్‌నగర్‌లో పర్యటించారు. ఎక్కడైతే సమస్య ఉందో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పాత కాలం నాటి పైప్‌లైన్ కారణంగా కొన్ని ఏరియాల్లో ఇలా జరుగుతోందని, పైప్‌లైన్ మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని జీఎం, డీజీఎం తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వెంకట్‌నగర్ బస్తీలో పర్యటించిన జలమండలి జీఎం, డీజీఎం

విద్యార్థినులపై కుక్కల దాడి

● ఇద్దరికి గాయాలు
● కోఠి మహిళా వర్సిటీలో ఘటన



కుక్కకాటుకు గాయపడిన విద్యార్థినులు

మంగళ్‌హాట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో కుక్కలు స్వైరవిహారం చేశాయి. ఇద్దరు విద్యార్థినులను కరిచాయి. తీవ్రగాయాలతో ఆస్పత్రులపాలయ్యారు. వేలమంది విద్యార్థులు చదివే విశ్వవిద్యాలయం, అందులోనూ మహిళా హాస్టళ్లు ఉన్న ప్రాంతంలో కుక్కలు విద్యార్థులను కరవడంతో మిగిలిన వారు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ జిల్లాకు చెందిన అంకిత(19) కోఠి మహిళా విశ్వవిద్యాలయంలోని హోంసైన్స్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో హాస్టల్ నుంచి తరగతి గదికి వెళ్తుండగా కుక్కలు వెంటపడడంతో ఆందోళనకు గురై కిందపడిపోయింది. కంటి వద్ద తీవ్ర గాయం కావడంతో పాటు కుక్కకాటు కారణంగా చెవికి తీవ్ర గాయమైనట్లు తెలిసింది. వెంటనే స్పందించిన సిబ్బంది ఆమెను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇదిలా ఉండగా, డిగ్రీ చదువుతున్న మరో విద్యార్థినిని సైతం కుక్కలు కరవడంతో గాయాలైనట్లు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. ఆమె వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. వారంలో నాలుగుసార్లు కుక్కలను తరలించాలని ఫిర్యాదు చేస్తున్నామని, అవి ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియడం లేదని వారు పేర్కొన్నారు.

9 కేసుల్లో మోస్ట్ వాంటెడ్

మూడేళ్లుగా పరారీలో ప్రదీప్

రాజస్థాన్‌లో పట్టుకున్న సైబరాబాద్ సీసీఎస్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అతనో ఘరానా నేరస్థుడు.. 9 కేసుల్లో మోస్ట్ వాంటెడ్.. నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయి.. మూడేళ్లుగా ఆచూకీ తెలియకుండా పరారీలో ఉన్నాడు.. పెండింగ్ కేసులపై దృష్టి పెట్టిన సైబరాబాద్ సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి ఘరానా మోసగాడి ఆటకట్టించారు. రాజస్థాన్‌లో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. సీసీఎస్ డీసీపీ నరసింహ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం దౌల్‌పూర్ జిల్లా బచౌలా గ్రామానికి చెందిన ప్రదీప్.. 2020 నుంచి 2022 వరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలు దొంగతనాలు, దోపిడీలకు పాల్పడ్డాడు. పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్నాడు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 9 కేసుల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్నాడు. నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉండడంతో డీసీపీ నరసింహ ఆధ్వర్యంలో సీసీఎస్ ప్రత్యేక టీమ్ రంగంలోకి దిగింది. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా నిందితుడు రాజస్థాన్‌లో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు నేరస్థుడి ఆటకట్టించి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఘరానా నేరస్థుడిని పట్టుకోవడానికి కృషిచేసిన ఏసీపీ శశాంక్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్, కొల్లూరు ఎస్‌హెచ్‌వో రవీందర్, హెడ్‌కానిస్టేబుల్ వీరస్వామి, రవీందర్‌రెడ్డి, కుమార్‌ను సీపీ అభినందించారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జనాభా ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణ చేయాలి : ఎమ్మార్పీఎస్

బౌద్ధనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదిక మీద వర్గీకరణ చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ డిమాండ్ చేశారు. సోమవారం పార్శీగుట్ట కార్యాలయంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీలోని అన్ని కులాలకు న్యాయం చేకూరాలనే ఉద్దేశంతో రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపరిచారన్నారు. ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణ చేయాలని మందకృష్ణమాదిగ నేతృత్వంలో రాజీలేని పోరాటం జరిగిందన్నారు. టీవీ నర్సింహ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాతీయ అధికారప్రతినిధి బి.భిక్షపతి మాదిగ, రాష్ట్ర కో-ఆర్డినేటర్ వెంకటస్వామిమాదిగ, హైదరాబాద్ జిల్లా అధికారప్రతినిధి డప్పు మల్లికార్జున్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.శ్రీనివాస్, విజయ్‌మాదిగ, వీఎస్.రాజు మాదిగ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా అనంత కృష్ణారావు



అడ్డగుట్ట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా అకునూరి అనంత కృష్ణారావు ఓటింగ్ ద్వారా నియమితులయ్యారు. ఈ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో గెలిపించిన తోటి స్నేహితులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు



రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో ముత్యాలమ్మదేవి పంచలోహ విగ్రహ కళాన్యాస పూర్వక పునఃప్రతిష్ఠ మహోత్సవం పూజలు సోమవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. 11వ తేదీ అమ్మవారి విగ్రహప్రాణ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు.



పీవీ పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో సంస్థ చైర్మన్ అండ్ ఎండీ అనురాగ్‌కుమార్ తదితరులు

గ్రీన్ ఎలక్ట్రిసిటీ వినియోగంలో ఈసీఐఎల్ మరో అడుగు

● రెండోదశ సోలార్ పీవీ ప్లాంట్ ప్రారంభం

కుషాయిగూడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్స్ రంగంలో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన ఈసీఐఎల్ సంస్థ గ్రీన్ ఎలక్ట్రిసిటీ వినియోగంలో మరో అడుగు వేసింది. ప్రస్తుతం ఉన్న 500 కిలో వోల్ట్స్ సామర్థ్యంతో కూడిన సోలార్ పీవీ పవర్ ప్లాంట్‌కుతోడు అడ్మిన్ బిల్డింగ్ సమీపంలో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈసీఐఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్‌కుమార్ ప్లాంట్‌ను సోమవారం ప్రారంభించారు. మొత్తం 912 ప్యానెల్స్‌తో ఏర్పాటు చేసిన ఈ సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా ఈసీఐఎల్ సంస్థకు అవసరమయ్యే వెయ్యి కిలో వోల్ట్స్ సోలార్ విద్యుత్‌ను సమకూర్చుకున్నట్లయింది. రాబోయే 25 ఏళ్లపాటు రోజూ 2000 కిలో వాట్స్ విద్యుత్‌ను వినియోగించుకునే అవకాశం కలిగిందని అనురాగ్ కుమార్ వెల్లడించారు. సోలార్ విద్యుత్ వాడకం ద్వారా సంవత్సరానికి 360 టన్నుల మేరకు కార్బన్ ఫూట్ ప్రింట్‌ను తగ్గించగలుగుతామని వివరించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు అనీష్ కుమార్ శర్మ(టెక్నికల్), రాజేంద్ర కుమార్ ప్రకాష్(ఫైనాన్స్), ఇతర అధికార సిబ్బంది పాల్గొన్నారు.

చిలకలగూడలో కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడలో సోమవారం సీతాఫల్‌మండి కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ పర్యటించారు. మెట్టుగూడ రైల్వేక్వార్టర్స్ నుంచి మురుగునీరు చిలకలగూడకు అధికంగా వస్తోందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయటంతో అధికారులతో కలిసి ఆమె బస్తీలో పర్యటించి, సమస్యపై చర్చించారు. డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినటంతో మురికినీరు పొంగి ఇళ్లలోకి వస్తోందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి త్వరలో సమస్యను పరిష్కారిస్తామని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ కుషాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారాసిగూడ ఎస్‌బీఐ లేన్‌లో సీసీరోడ్డు నిర్మాణపనులను కార్పొరేటర్ పరిశీలించారు. రూ.14లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, నాయకులు జాకీర్, అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు తవ్వి.. పూడ్చకుండా వదిలేసి..



బౌద్ధనగర్‌లో ప్రధాన రహదారి పక్కన తవ్విన రోడ్డు

బౌద్ధనగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టేబుల్ డ్రైన్ వర్క్ పనుల నిమిత్తం బౌద్ధనగర్ ప్రధాన రహదారి పక్కన రోడ్డును తవ్వి నిర్లక్ష్యంగా వదిలివేయటంలో స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 25 రోజుల క్రితం బౌద్ధనగర్ ప్రధాన రహదారి పక్కన టేబుల్ డ్రైన్ వర్క్ పనుల నిమిత్తం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది రోడ్డును తవ్వారు. పనులు పూర్తైన తర్వాత కొద్దిమేర రోడ్డుపై స్లాబు వేశారని, మిగతాది అలాగే వదిలివేయటంతో పలు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇళ్లలోని కార్లు, ద్విచక్ర వాహనాలను తీయలేని పరిస్థితి ఏర్పడిందని, ఏమైనా పనులు చేయాలంటే తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా రేపు, మాపు వేస్తామని కాలాయాపన చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తవ్విన రోడ్డుకు స్లాబ్‌ను వేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

పేదలకో న్యాయం.. ఉన్నోళ్లకో న్యాయమా?



ఫుట్‌పాత్‌పై భవన నిర్మాణ సామగ్రి

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేస్తున్న పేదవారిపై ఇటీవల రోప్ పేరిట కఠినంగా వ్యవహరిస్తూ వారి జీవనాధారాన్ని ఛిద్రం చేస్తున్న ట్రాఫిక్, మున్సిపల్ అధికారులకు ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డు ఆక్రమించి భవన నిర్మాణ సామగ్రిని వేసి ఉన్నవారు కనిపించడం లేదా అని ఎంఐఎం రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులు పాపడ్ అశోక్ ప్రశ్నిస్తున్నారు. పేదలకో న్యాయం... ఉన్నోళ్లకో న్యాయమా అని అన్నారు. సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డు పార్క్‌లేన్ చౌరస్తాల మధ్య నిర్మిస్తున్న ఓ వ్యాపార సముదాయానికి చెందిన నిర్మాణ సామగ్రి సంవత్సరాల కొద్ది ఫుట్‌పాత్‌తో పాటు రోడ్డును ఆక్రమించి తమ పనులను కొనసాగిస్తున్నారు. పొట్టకూటి కోసం ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకొనే చిరువ్యాపారాలపై మాత్రం ప్రతాపం చూపే అధికారులకు ఈ ఆక్రమణలు కనిపించడం లేదా అన్నారు. ఇప్పటికైనా ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న బిల్డర్‌పై ఉన్నతాధికారులు చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు.

16న సంగీత, నృత్య, వాయిద్య పోటీలు

చిలకలగూడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, వారి పిల్లలకు ఈ నెల 16న శాస్త్రీయ, లలిత సంగీత, వాయిద్య, నృత్య, మిమిక్రీ, మోనెయాక్షన్, మ్యాజిక్ షోలలో పోటీలు నిర్వహిస్తున్నామని సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ ఉదయం 9.30కు సంచాలన్ భవన్, 5వ అంతస్తు, హవామహల్‌లో పోటీలు ప్రారంభమవుతాయని ఆసక్తి గలవారు 10వతేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. రైల్వే ఆసుపత్రి లాలాగూడ, జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ మౌలాలి, రైల్వే డిగ్రీ కాలేజీ, ఎస్‌టీసీ, ఇరిసెట్, ప్రింటింగ్ ప్రెస్ మెట్టుగూడ (జీఎస్, అండ్ ఎస్‌టీ) ఫైనాన్షియల్ అడ్వయిజర్(టీ) కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, వారి పిల్లలు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీల్లో మొదటి స్థానం కైవసం చేసుకున్నవారు 17, 18 తేదీల్లో నిర్వహించే ఇంటర్ డివిజనల్ పోటీల్లో అర్హత సాధిస్తారని పేర్కొన్నారు.

తాడ్‌బంద్ ఆంజనేయస్వామి జన్మనక్షత్ర పూజలు



బోయినపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ తాడ్‌బంద్ వీరాంజనేయస్వామి జన్మనక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఆలయ భజన సమాజం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలులో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌కు చేరుకున్న ఓ రైలులో ఓ వ్యక్తి మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పందరి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలులో సీ1 కోచ్‌లో గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉండగా తోటి ప్రయాణికుల సమాచారం మేరకు రైల్వేపోలీసులు మృతదేహన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.